సాక్షి
అన్నమయ్య జిల్లా

గురువారం । 16 । జనవరి । 2025



పట్టుకున్నారు .. వదిలేశారు!

గుర్రంకొండలో పోలీసులు రేషన్ బియ్యం లారీని ఉదయం పట్టుకొని సాయంత్రం వదిలేశారు. ఈ విషయమై పోలీస్ స్టేషన్ వద్ద రోజంతా హైడ్రామా నడిచింది. -8లో



పండగ సంబరం.. మధుర జ్ఞాపకం

రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల్లో ఉండే ప్రజలు సంక్రాంతి కోసం ఆనందంగా సొంతూళ్లకు వచ్చారు. సంక్రాంతి పండుగ అందరిలోనూ ఆనందభరితమైన స్మృతులను నింపింది. -8లో

మదనపల్లె : టమాటా ధరలు (10 కిలోలు)

	కనిష్టం	గరిష్టం
మొదటిరకం	రూ.120	రూ.150
రెండోరకం	రూ.80	రూ.110

మార్కెట్‌కు వచ్చిన మొత్తం సరుకు : 60 మెట్రిక్ టన్నులు



న్యూస్‌రీల్

చెన్నకేశవా.. కరుణించవా



శ్రీదేవి,భూదేవిలతో శ్రీ చెన్నకేశవస్వామి

రాజంపేట: పదకవితాపితామహుడు తాళ్లపాక అన్నమాచార్యుల జన్మస్థలి తాళ్లపాకలో, అన్నమయ్య ఆరాధించిన శ్రీ చెన్నకేశవునికి బుధవారం పార్వేట ఉత్సవం నిర్వహించారు. శ్రీచెన్నకేశవ, శ్రీదేవి, భూదేవి ఉత్సవ మూర్తులను సుందరంగా అలంకరించారు. అనంతరం పార్వేట ఉత్సవానికి తీసుకెళ్లారు. ఈ సందర్భంగా భక్తులు స్వామివారిని దర్శించుకుని చెన్నకేశవా.. కరుణించవా అని వేడుకున్నారు. తాళ్లపాక సర్పంచి గౌరీశంకర్, టీటీడీ సిబ్బంది పాల్గొన్నారు.

హాకీ సబ్ జూనియర్స్ జట్టు ఎంపిక

మదనపల్లె సిటీ: జిల్లా హాకీ సబ్ జూనియర్స్ జట్టును బుధవారం స్థానిక బీటీ కాలేజీ హాకీ మైదానంలో ఎంపిక చేశారు. వివరాలను ది హాకీ అన్నమయ్య జిల్లా అధ్యక్షులు పి.వి.ప్రసాద్, కార్యదర్శి బి.శివప్రసాద్, కోశాధికారి పి.ప్రసాద్‌రెడ్డిలు ప్రకటించారు. పి.పునిత్‌కుమార్, ఎస్.అజయ్‌కుమార్‌రెడ్డి, వి.హర్షవర్ధన్ రెడ్డి, వి.జగన్‌మోహన్‌రెడ్డి, వి.రెడ్డిబాలాజీ,డి.మహీధర్, ఎం.రవితేజ, ఎస్ఎం దినేష్‌ఫర్హాన్, పి.నికిలేష్, ఎస్.హర్షవర్ధన్‌రెడ్డి, చైతన్య, అశోక్, డి.రెడ్డిప్రసాద్, ఎస్.ఉమర్‌ఫరూక్, వి.గణేష్‌కుమార్‌రెడ్డి, కార్తీక్, సి.వెంకటలిఖిత్, లిఖిత్‌సాయిరెడ్డిలు ఎంపికయ్యారు. ఈనెల 17 నుంచి మదనపల్లెలో జరిగే రాష్ట్ర స్థాయి సబ్ జూనియర్స్ పోటీల్లో పాల్గొంటారని తెలిపారు.కార్యక్రమంలో కన్వీనర్ హితేష్‌రావు, కోచ్ నౌషాద్ తదితరులు పాల్గొన్నారు.

ఢిల్లీ యువజనోత్సవాల్లో మదనపల్లె విద్యార్థినులు



లంబాడీ నృత్య ప్రదర్శన ఇస్తున్న విద్యార్థినులు

మదనపల్లె: వికసిత్ భారత్ కార్యక్రమంలో భాగంగా కేంద్ర మానవవనరుల శాఖ న్యూఢిల్లీలో మూడురోజుల పాటు నిర్వహించిన యంగ్ లీడర్స్ డైలాగ్, నేషనల్ యూత్ ఫెస్టివల్-2025కు ఆంధ్రప్రదేశ్ తరపున మదనపల్లె జ్ఞానాంబిక డిగ్రీ కళాశాల విద్యార్థినులు హాజరయ్యారు. ఈనెల 12, 13 తేదీల్లో న్యూఢిల్లీలోని భారత్ మండపంలో లంబాడీ నృత్యప్రదర్శనలు ఇచ్చి సభికులను అలరించారు. అనంతరం ఎయిర్‌పోర్ట్ ఆఫీసర్స్ క్లబ్‌లో కేంద్రమంత్రి రామ్మోహన్‌నాయుడు, అమలాపురం ఎంపీ జి.హరీష్ మాథుర్ సమక్షంలో నృత్యప్రదర్శనలు ఇచ్చారు. ఈ సందర్భంగా కేంద్రమంత్రి బహుమతులు అందజేసి సన్మానించారు. నృత్యప్రదర్శనలకు డాన్స్, డప్పుమాస్టర్‌లుగా సురేష్, రామ్మోహన్, నాగరాజు వ్యవహరించారు. కళాశాల కరస్పాండెంట్ డాక్టర్.రాటకొండ గురుప్రసాద్, ప్రిన్సిపాల్ సురభిరమాదేవి విద్యార్థినులను అభినందించారు.

రామయ్యను దర్శించుకున్న కలెక్టర్



పూజల్లో పాల్గొన్న వైఎస్సార్ జిల్లా కలెక్టర్ శ్రీధర్ దంపతులు

ఒంటిమిట్ట: ఒంటిమిట్ట శ్రీ కోదండరామస్వామి దేవాలయాన్ని మంగళవారం సంక్రాంతి పండుగ సందర్భంగా వైఎస్సార్ జిల్లా కలెక్టర్ శ్రీధర్ సతీ సమేతంగా దర్శించుకున్నారు. ఆలయ అధికారులు వారికి స్వాగతం పలికి, బాలాలయంలోని మూల మూర్తులకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం అర్చకులు స్వామివారి తీర్థప్రసాదాలను అందజేశారు. వీరి వెంట మండల రెవెన్యూ సిబ్బంది ఉన్నారు.

సిద్దవటం కోట సందర్శన

సిద్దవటం: మండల కేంద్రమైన సిద్దవటంలోని మట్లి రాజుల కోటను మంగళవారం సాయంత్రం వైఎస్సార్ జిల్లా కలెక్టర్ చెరుకూరి శ్రీధర్ సందర్శించారు. ఈ సందర్భంగా కోటలోని ముఖద్వారం, మొదటి, రెండో మండపాలు, పార్కులు, ఈద్గా, ధంకానగర్, తవ్వకాల్లో బయల్పడిన శివలింగం, మూతి విరిగిన నంది విగ్రహం, కామాక్షమ్మగుడి, బిస్మిల్లాషా ఖాద్రి దర్గా, రాణి స్నానవాటిక, రాణీమహల్‌ను తిలకించారు. కోటలోని కట్టడాలకు సంబంధించి పురావస్తు శాఖ గైడ్ పాలెం నరసింహులు కలెక్టర్‌కు తెలియజేశారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ ఇక్కడి శిల్పాలు అద్భుతంగా ఉన్నాయని కొనియాడారు. మండల రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ ప్రసాద్, స్థానిక పోలీసులు పాల్గొన్నారు.

నాడు బెదిరించారు.. నేడు కొల్లగొట్టారు





- ప్రభుత్వం మాదే.. మాకేమి కాదనే ధీమాతో అక్రమ తరలింపు
- నాడు కత్తులతో వెళ్లి అక్రమ మైనింగ్‌దారుల బెదిరింపులు
- టిఫిన్ బెరైటీస్ సూపర్‌వైజర్లకు హెచ్చరికలు జారీ
- సీసీ కెమెరాలను బిగించకుండా అడ్డగింత
- న్యాయం చేయాలంటూ వేముల పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు



టిఫిన్ కంపెనీ ప్రాంగణంలో నిల్వ ఉన్న బెరైటీస్ ఖనిజం

సాక్షి ప్రతినిధి, కడప: 'అధికారం మాదే.. మా ఇష్టమొచ్చినట్లు మైనింగ్ చేస్తాం. సీసీ కెమెరాలు బిగిస్తే సహించం. చెప్పినట్లు వినకుంటే తలకాయలు తీస్తాం. ప్రభుత్వం మాదే.. మాకేమి కాదు.'కత్తులతో వెళ్లిన ఓ గ్యాంగ్ మూన్నెళ్ల క్రితం హల్‌చల్ చేసింది. అక్రమ మైనింగ్ నుంచి స్వీయ రక్షణ కోసం సూపర్‌వైజర్లు సీసీ కెమెరాలు బిగిస్తుంటే రెచ్చిపోయారు. చరిత్ర తెలుసుకొని మసలుకోండి. మీరెమన్నా పెద్ద మొనగాళ్లా అంటూ రెచ్చిపోయారు. అదే విషయాన్ని బాధితులు వేముల పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఎలాంటి చర్యలు లేవు. తదుపరి అదును చూసి వేల టన్నుల బురైటీస్ ఖనిజాన్ని కొల్లగొట్టారు.

- వేముల మండలంలోని టిఫిన్ బెరైటీస్ కంపెనీ లీజు మైనింగ్ కార్యకలాపాలు నిర్వహిస్తోంది. తెలుగుదేశం పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత ఆ పార్టీ నేతలు ఆ కంపెనీ పరిధిలో అక్రమ మైనింగ్ కార్యకలాపాలకు పాల్పడుతున్నారు. ఈనేపథ్యంలో లీజు ప్రాంతంలో నిరంతరం కాపాలా ఉండేలా టిఫిన్ బెరైటీస్ కంపెనీ ఐదుగురు సూపర్‌వైజర్లను నియమించుకుంది. అక్రమ కార్యకలాపాల నుంచి స్వీయ రక్షణ కోసం అక్టోబర్ 21న సీసీ కెమెరాలు లీజు పరిసరాల్లో ఏర్పాటు చేసుకున్నారు. ఆ విషయాన్ని తెలుసుకున్న స్థానిక టీడీపీ నేత పేర్ల పార్థసారధిరెడ్డి సోదరుడు శేషారెడ్డి రెండు వాహనాల్లో మనుషులతో వెళ్లి హంగామా చేశారు. ఈ ప్రాంతంలో సీసీ కెమెరాలు బిగించవద్దని హెచ్చరించారు. మా ప్రాంగణంలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకుంటున్నామని సూపర్‌వైజర్లు వివరిస్తే, తలకాయలు తీసుకెళ్తాం, మాకేమి కాదు, ప్రభుత్వం మాదే, అటు వెళ్తాం, ఇటు వస్తాం అంటూ కత్తుల ప్రదర్శన చేశారు. మాకేమి కేసులు కొత్త కాదు, జైలు జీవితం గడిపే వచ్చాం. మా ప్రభుత్వంలో ఎలాంటి అనుమతులు లేకపోయినా సరే, మేము మైనింగ్ చేసుకుంటాం. మీరెవ్వరూ అడ్డుచెప్పడానికంటూ తెలుగుతమ్ముళ్లు రెచ్చిపోయారు. టిఫిన్ మైనింగ్ కంపెనీ వద్ద సీసీ కెమెరాలను అమర్చకుండా అడ్డుకుని వెనక్కి పంపారు. ఇక్కడ కనిపిస్తే తీవ్ర పరిణామాలు ఉంటాయని హెచ్చరించారు. ఈ ప్రాంతానికి ఇకపై ఎవరూ రాకూడదని, ఎవరైనా వస్తే తీవ్ర పరిణామాలు ఎదుర్కోవాల్సి వస్తుందని గట్టిగా హెచ్చరించారు. అదే విషయాన్ని సూపర్‌వైజర్లు టిఫిన్ బెరైటీస్ ప్రతినిధుల దృష్టికి తీసుకెళ్లారు. యాజమాన్య ప్రతినిధుల సూచనల మేరకు సూపర్‌వైజర్లు వేముల పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు కూడా చేశారు.



టీడీపీ నేతల బెదిరింపులపై గతంలో సాక్షిలో ప్రచురితమైన కథనం

నిమ్మకు నీరెత్తినట్లుగా మైనింగ్‌శాఖ

నేషనల్ కంపెనీ లా ట్రిబ్యునల్ ద్వారా కొనుగోలు చేసిన బెరైటీస్ ఖనిజాన్ని కాపాడుకోలేని దయనీయమైన పరిస్థితులు జిల్లాలో నెలకొన్నాయి. మైనింగ్‌శాఖ నిర్లక్ష్యం, అధికారమత్తులో జోగుతుండడమే అందుకు ప్రధాన కారణమని పలువురు వివరిస్తున్నారు. కోట్లాది రూపాయల ఖనిజాన్ని కొల్లగొడుతున్నారని ప్రత్యక్షంగా ఫిర్యాదులొచ్చినా అటువైపు కన్నెత్తి చూసిన పాపానపోలేదు. దీంతో అక్రమ మైనింగ్, లీజుదారుల ఖనిజం లూటీ తెరపైకి వచ్చాయని పలువురు వివరిస్తున్నారు. పవన్ మినరల్స్, డైమెండ్ మినరల్స్, జకరయ్య మినరల్స్‌కు లూటీ చేసిన బెరైటీస్ ఖనిజాన్ని తరలించారని టిఫిన్ కంపెనీ కేర్ టేకర్ రామలింగారెడ్డి ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా మైనింగ్‌శాఖలో చలనం ఉంటే ఆయా మినరల్స్ కంపెనీల్లో ఉన్న స్టాకు ఎంత? ఎవరి మైనింగ్ నుంచి ఎంత మోతాదులో తీసుకొచ్చారన్న విషయాన్ని రికార్డులను పరిశీలిస్తే లూటీ వ్యవహారం నిగ్గుతేల్చే అవకాశం లేకపోలేదు. అలాంటి చర్యలు చేపట్టేందుకు జిల్లా యంత్రాంగం ఏమాత్రం చొరవ చూపే అవకాశం లేదని, సర్వోన్నతాధికారికి చిత్తశుద్ధి ఉన్నట్లు అస్సలు కన్పించడం లేదని విశ్లేషకులు ఆరోపిస్తున్నారు.

వ్యవస్థలు నిర్వీర్యం కావడంతోనే...

వ్యవస్థ తనంతట తాను రాజ్యాంగానికి లోబడి వ్యవహరిస్తే, చట్టం తన పని తాను చేసుకపోతుంది. అప్పుడే కొంతలో కొంతైనా ప్రజల ధన, మాన ప్రాణాలకు రక్షణగా నిలుస్తుంది. వ్యవస్థలు నిర్వీర్యం అయితే దౌర్జన్యపరులదే రాజ్యం.. దోపిడీ దారులదే భోజ్యం అన్నట్లుగా ఉండిపోతుంది. టిఫిన్ బెరైటీస్ ప్రతినిధులు పేర్ల పార్థసారధిరెడ్డి సోదరుడు పేర్ల శేషారెడ్డి అండ్ కో బెదిరింపులకు పాల్పడింది. తలకాయలు తీస్తామంటూ హెచ్చరికలు చేశారని వాపోయి, పోలీసులను ఆశ్రయిస్తే చర్యలు శూన్యం. దీంతో అదే కంపెనీకి చెందిన రూ.10కోట్ల విలువైన బెరైటీస్ ఖనిజం రాత్రికి రాత్రి లూటీ అయింది. తాజాగా ఆ కంపెనీ కేర్ టేకర్ వేల్పుల రామలింగారెడ్డి సైతం పార్థసారధిరెడ్డి, శేషారెడ్డి, శ్రీనాథరెడ్డి నేతృత్వంలోనే అక్రమంగా తరలించకపోయారని బాహాటంగా ఆరోపణలు చేస్తున్నారు. వేముల పోలీసులకు ఫిర్యాదు కూడా చేశారు. అయినా ఆశించిన చర్యలు కన్పించలేదు. స్టాకు ఎక్కడెక్కడికి తరలించారు. ఏయే లారీల్లో తీసుకెళ్లారన్న విషయాన్ని లారీ నంబర్లుతో సహా వివరిస్తున్నారు. చట్టానికి లోబడి అధికారులు వ్యవహరిస్తే వెంటనే బెరైటీస్ స్టాకు స్వాధీనం చేసుకునే అవకాశం ఉంది. అలాంటి పరిస్థితి జిల్లాలో కన్పించలేదని పలువురు వాపోతున్నారు. వ్యవస్థలు నిర్వీర్యం కావడమే అందుకు ప్రధాన కారణమని విశ్లేషకులు వెల్లడిస్తున్నారు. ఈ వ్యవహారాన్ని నాలుగురోజులు తాత్సారం చేస్తే బెరైటీస్ పౌడర్‌గా మారిపోయి, ఎక్స్‌పోర్ట్సు చేసి తద్వారా భారీగా అక్రమ ఆదాయం గడించే అవకాశం లేకపోలేదు.

కత్తులు దూసిన కోళ్లు



తలపడుతున్న కోడిపుంజులు

- చేతులు మారిన రూ.నోట్ల కట్టలు
- టీడీపీ నాయకుల కనుసన్నల్లోనే అన్నీ
- ప్రేక్షక పాత్రలో ప్రొహిబిషన్, పోలీసులు

రాయచోటి: కోడిపందేలు, గుండాటలు, పేకాటల్లో ఎన్ని లక్షల రూపాయల కట్టలు చేతులు మారాయో లెక్కగట్టి చెప్పేందుకు ప్రత్యేకంగా మనుషులేం ఉండరు. సంక్రాంతి పండుగను ఆసరాగా చేసుకున్న టీడీపీ నాయకులు జిల్లా వ్యాప్తంగా రెచ్చిపోయారు. విచ్చలవిడిగా మద్యం అమ్మకాలను చేపట్టారు. నాయకుల కనుసన్నల్లోనే పోటాపోటీగా కోడిపందేలు, పేకాట స్థావరాలను ఏర్పాటు చేశారు. ఊరూరా మద్యం దుకాణాలు వెలిశాయి. గ్రామాల్లో ఉన్న కూల్ డ్రింక్ షాపుల్లో మద్యం అమ్మకాలను బహిరంగంగానే చేపట్టారు. వీటిని నిలువరించాల్సిన పోలీసులు, ప్రొహిబిషన్ అధికారులు ప్రేక్షకు పాత్రను పోషించాల్సి వచ్చింది. అన్నమయ్య జిల్లాలోని రాయచోటి, రాజంపేట, పీలేరు, కోడూరు, మదనపల్లి, తంబళ్లపల్లి నియోజకవర్గం ప్రతి మండలంలో కోళ్ల పందేలు, పేకాట స్థావరాలు, మద్యం అమ్మకాలు కొనసాగాయి. స్థానిక తెలుగుదేశం పార్టీ నాయకులు కొందరు స్థావరాలను ఏర్పాటు చేసి ఎంట్రీ ఫీజు రూపంలో లక్షల రూపాయలు ఆదాయాన్ని గడించారనడంలో సందేహం లేదు. కోడిపందేలు భోగి, సంక్రాంతి, కనుమల్లోనే కాదు..పండక్కి వారం ముందే మొదలవుతాయి. రాష్ట్రంలోని తూర్పు, పశ్చిమగోదావరి జిల్లాలను మరిపించేలా అన్నమయ్య జిల్లా వ్యాప్తంగా కోడిపందేలు, పేకాట స్థావరాలను ఏర్పాటు చేశారు. నూతన సంవత్సరం ప్రారంభ దశ మూడు రోజుల్లోనే రూ.10 కోట్ల మద్యాన్ని జిల్లాలోని మద్యం ప్రియులు తాగారు. ఈ లెక్కన సంక్రాంతికి రెండింతల పైన వ్యాపారం జరిగి ఉంటుందన్న అంచనాలు ఉన్నాయి. స్థానికంగా ఉన్న మండల, గ్రామ స్థాయిలోని టీడీపీ నాయకులు చేతుల మీదుగా కోడిపందేలు ప్రారంభమయ్యాయి. దీంతో చాలా చోట్ల పోలీసులు చూసీ చూడనట్లుగా వ్యవహరించారు.

ఒంటిమిట్టలో రామయ్య పార్వేట ఉత్సవం



పార్వేట ఉత్సవానికి శృంగిశైలి పర్వతంపైకి వెళుతున్న ఉత్సవ మూర్తులు



సీతారాముల ఉత్సవ మూర్తులకు నమస్కరిస్తున్న భక్తులు

ఒంటిమిట్ట: ఏకశిలానగరి ఒంటిమిట్ట శ్రీ కోదండరామస్వామి దేవాలయంలో బుధవారం కనుమ పండుగ సందర్భంగా తిరుమల-తిరుపతి దేవస్థానం (టీటీడీ) వారు రామయ్య పార్వేట ఉత్సవం ఘనంగా నిర్వహించారు. ముందుగా బాలాలయం ఆవరణలో సీతారామ లక్ష్మణ మూర్తుల ఉత్సవ విగ్రహాలను పల్లకీపై కొలువుదీర్చారు. పట్టు వస్త్రాలు, బంగారు ఆభరణాలు, తులసి గజమాలతో సుందరంగా అలంకరించారు. అనంతరం శృంగిశైలి పర్వతంపై పార్వేట ఉత్సవానికి బయలుదేరారు. మేళతాళాల నడుమ కార్యక్రమం కొనసాగింది. శృంగిశైలి పర్వతంపై ఉన్న పార్వేట మండపంలో ఆలయ అర్చకులు వీణ రాఘవాచార్యులు, శ్రావణ్ కుమార్, పవన్ కుమార్‌లు శాస్త్రోక్తంగా పూజలు నిర్వహించారు.అనంతరం ఉత్సవ విగ్రహాలను గ్రామోత్సవానికి తీసుకెళ్లారు. ఈ కార్యక్రమంలో ఆలయ టీటీడీ డిప్యూటీ ఈఓ నటేష్ బాబు, ఇన్‌స్పెక్టర్ నవీన్ కుమార్, ఏఈ అమర్నాథ్ రెడ్డి, విజిలెన్స్ అధికారి గంగులయ్య, పెద్ద ఎత్తున భక్తులు పాల్గొన్నారు.

- పార్వేట ఉత్సవంలో భాగంగా శృంగిశైలి పర్వతంపైకి వెళుతున్న సమయంలో స్వామికోసం వేసిన చలువపందిళ్లు తగిలి ఉత్సవ విగ్రహాలు వెనుకకు వాలాయి. దీంతో అప్రమత్తమైన పల్లకీ మోసేవాళ్లు పల్లకీని కిందకు వంచి ఉత్సవ విగ్రహాలను తీసుకెళ్లారు. అయితే ఉత్సవ విగ్రహాలకు వెనుకవైపు ఉన్న తోరణం వంగిపోయింది.

బాలలకు నవోదయం



మదనపల్లెలోని నవోదయ విద్యాలయం



విద్యాలయంలో కంప్యూటర్ తరగతుల్లో విద్యార్థులు

- ఈనెల 18న ప్రవేశ పరీక్ష నిర్వహణ
- సీటు సాధించాలంటే మెలకువలు తప్పనిసరి

మదనపల్లె సిటీ: గ్రామీణ, పట్టణ ప్రాంత విద్యార్థుల జీవితానికి జవహర్ నవోదయ విద్యాలయం విజ్ఞాన వారధిగా నిలుస్తోంది. విలువలతో కూడిన విద్య, నైపుణ్యాలు, దేశభక్తి, క్రీడలు, సాంస్కృతిక కార్యక్రమాలు, చిత్రలేఖనం, ఎన్‌సీసీ ఇలా అన్నింటికి నవోదయ విద్యాలయం ప్రసిద్ధి. కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా సామాన్య, బడుగు, బలహీనవర్గాల పేద విద్యార్థులకు విద్యనందిస్తోంది. ఉమ్మడి చిత్తూరు జిల్లాలో మదనపల్లె సమీపంలోని వలసపల్లెలోని నవోదయ విద్యాలయం, ఉమ్మడి వైఎస్సార్ జిల్లా పరిధిలోని రాజంపేట నవోదయ విద్యాలయంలో 6వ తరగతి ప్రవేశానికి ఈనెల 18న ప్రవేశపరీక్ష నిర్వహించనున్నారు.ఈ నేపథ్యంలో ఇందులో సీటు సాధించేందుకు మెలకువలను అక్కడి ఉపాధ్యాయులు తెలియజేస్తున్నారు. ఒకే బుక్‌లెట్‌లో (ప్రశ్నపత్రం) మూడు భాగాలుంటాయి.

ప్రవేశ పరీక్ష తేదీ: **18-1-2025**

ప్రవేశం: **6**వ తరగతి

పరీక్షా కేంద్రాలు: **26**

సమయం: ఉదయం **11.30** నుంచి మధ్యాహ్నం **1.30** గంటల వరకు

దరఖాస్తు చేసుకున్న విద్యార్థులు: **5058**

సీట్లు: రాజంపేటలో **80**, మదనపల్లెలో **80**

పరీక్ష రకం	ప్రశ్నలు	మార్కులు	కాలవ్యవధి
మేధాశక్తి	40	50	60 నిమిషాలు
అంక గణితం	20	25	30 నిమిషాలు
భాషా పరీక్ష	20	25	30 నిమిషాలు

అంకగణితం పరీక్ష



ప్రవేశ పరీక్షలో అంకగణితంలోని 23 చాప్టర్ల నుంచి ఒక లెక్క వస్తుంది. సరాసరి, సంఖ్యల మీద మూల ప్రక్రియ, దశాంశాలను భిన్నంకాలుగా మార్చడం, భిన్నాంకాలను దశాంశాలుగా మార్చడం, వివిధ రకాల కొలతలు, పొడవులు, శక్తి, కాలం, ధనం మొదలైన వాటితో సంఖ్యతో వినియోగం, చిన్న సంఖ్యలు భిన్నంతో కూడిక, తీసివేత, గుణకారం,శాతాన్ని లెక్కించడం, లాభం, నష్టం (శాతం లెక్కింపు లాభం, నష్టం అంశం నుంచి వినహాయింపు) చుట్టుకొలత, ప్రాంతం-బహుభుజి, దీర్ఘచతురస్రం, త్రిభుజాలు వస్తాయి. వీటిపై ఎక్కువ సాధన చేయాలి. కోణం రకాలు, బార్ రేఖాచిత్రం తప్పకుండా వస్తుంది.

–చలపతినాయుడు, గణిత ఉపాధ్యాయుడు, మదనపల్లె

విద్యార్థి సామర్థ్యం అంచనా



విద్యార్థి పఠనాశక్తిని అంచనా వేయడానికి పరీక్ష ఉంటుంది. సొంతంగా గద్యభాగం ఇస్తారు. ప్రతి అంశానికి ఐదు ప్రశ్నలు ఉంటాయి. అభ్యర్థి ప్రతి అంశాన్ని జాగ్రత్తగా చదివి ప్రశ్నలకు జవాబులను సమాధానపత్రంలో గుర్తించాలి. కింద ఒక గద్యాంశం, దానికి కొన్ని ప్రశ్నలు ఇస్తారు. అభ్యర్థి దీనిని ఒక నమునాగా గ్రహించాలి. గద్యభాగం అర్థం, తెలుగుకు సంబంధించిన గద్యభాగాలను ఎక్కువగా ఇస్తారు. చిన్న పిల్లలకు ఇచ్చే పుస్తకాల్లో ఏదైనా ఒక కథ అంశాన్ని ఎంచుకుని ఇస్తారు. తెలుగు వాచకంలో ఎక్కడ ఉండవు. వీటికి మంచి మార్కులు తెచ్చుకుంటే సీటు సాధించవచ్చు.

–క్రిష్ణయ్య, ఉపాధ్యాయుడు, మదనపల్లె

పరీక్షకు అన్ని ఏర్పాట్లు చేశాం



ఉమ్మడి చిత్తూరు జిల్లాలో పరీక్షలు రాసే విద్యార్థులకు అన్ని ఏర్పాట్లు చేశాం. 26 కేంద్రాలకు సిబ్బంది,ప్రత్యేక స్క్వాడ్, ఫ్లయింగ్ స్క్వాడ్ ఉంటారు. ప్రవేశపరీక్షలో ఎక్కువ మార్కులు వచ్చిన వారికి నేరుగా సీట్లు కేటాయిస్తాం. ఇక్కడ సీటు వస్తే విద్యార్థులకు మంచి భవిష్యత్తు ఉంటుంది. అన్ని వసతులు ఉంటాయి. ఒత్తిడి చేయడం, ప్రయోగ పూర్వకంగా బోధిస్తాం. ప్రతి రోజూ ఆయా తరతగతుల ఉపాధ్యాయుల పర్యవేక్షణ ఉంటుంది.

–వేలాయుధన్, ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్, జవహర్ నవోదయ, మదనపల్లె

23న కనకదాస జయంత్యుత్సవం



పోస్టర్‌లు ఆవిష్కరిస్తున్న కురుబ సంఘ నాయకులు

మదనపల్లె: కురుబ,కురుమ, కురువ కుల బాంధవుడైన భక్తశ్రేష్ట కనకదాసు 537వ జయంత్యుత్సవాలు, జనవరి 23న మదనపల్లె శ్రీరామ తులసీ కల్యాణమండపంలో ఘనంగా నిర్వహిస్తున్నట్లు ఏపీ కురుబసంఘం, దక్షిణభారతదేశ ఓబీసీ అధ్యక్షులు జబ్బల శ్రీనివాసులు తెలిపారు. బుధవారం స్థానిక కురుబసంఘం కార్యాలయంలో ఏర్పాటుచేసిన మీడియా సమావేశంలో సంఘ సభ్యులతో కలిసి కనకదాస జయంత్యుత్సవాల పోస్టర్‌లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జబ్బల శ్రీనివాసులు మాట్లాడుతూ...ప్రతి ఏడాది కురుబసంఘం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న కనకదాస జయంత్యుత్సవాల్లో భాగంగా ఈ ఏడాది నూతనంగా ఎన్నికైన కురుబ కుల ప్రజాప్రతినిధులు, మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎంపీ, కార్పొరేషన్ డైరెక్టర్లు, మాజీ మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎంపీలను సన్మానిస్తామన్నారు. అనంతరం ఏపీ కురుబసంఘం జనరల్ బాడీ మీటింగ్ నిర్వహించి, నూతన రాష్ట్ర, జిల్లాల కార్యవర్గం ఏర్పాటుచేస్తామన్నారు. కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షులు ఆర్.కే.శ్రీనివాసులు, మర్రి పాడురమేష్, జి.మనోహర, కప్పలరాజన్న, జబ్బల రెడ్డెప్ప, గుడిరామాంజులు, గోవిందు, కొప్పలచిన్నప్ప, జనార్ధన్‌నాయుడు, జబ్బలచంద్ర, శివన్న, మణి, వేణుగోపాల్ తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

ఒకే రోజు రెండు ఇళ్లలో చోరీ



చోరీ జరిగిన ఇళ్ల వద్ద విచారణ సాగిస్తున్న పోలీసులు

రాయచోటి టౌన్ : రాయచోటి పట్టణంలోని రాజీవ్ స్వగృహ సముదాయంలో ఒకే రోజు రెండు ఇళ్లలో చోరీ జరిగినట్లు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు బుధవారం రాయచోటి అర్బన్ సీఐ చంద్రశేఖర్‌కు ఫిర్యాదు చేశారు. దీనిపై రాయచోటి డీఎస్పీ కృష్ణ మోహన్ చోరీ ఘటనపై త్వరగా విచారణ సాగించి దొంగలను పట్టుకోవాలని ఆదేశించారు. దీంతో సీఐ తన సిబ్బంది ఎస్ఐ నరసింహారెడ్డి, మహమ్మద్ జాహీర్‌లతో కలసి సంఘటన స్థలానికి వెళ్లి పూర్తి స్థాయి విచారణ సాగిస్తున్నారు. చోరీ జరిగిన ఇళ్లలో మొత్తం రెండు తులాలు (20 గ్రాములు) బంగారు ఆభరణాలు, 10 తులాల (100 గ్రాములు) వెండి పాత్రలతో పాటు రూ.20 వేలు నగదు దోచుకెళ్లినట్లు ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. సంక్రాంతి పండుగ కోసం తమ తమ స్వగ్రామాలకు వెళ్లగా ఇదే అదునుగా భావించి చోరీకి పాల్పడినట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు.

సిద్దవటం చేరిన విదేశీయుల సైకిల్ యాత్ర



సిద్దవటంలో విదేశీ దంపతులు

సిద్దవటం : జర్మనీ దేశానికి చెందిన స్టీఫెన్, సుఫియా దంపతులు హైదరాబాద్ నుంచి చెన్నైకి చేపట్టిన సైకిల్ యాత్ర మంగళవారం సిద్దవటం చేరింది. ఈ సందర్భంగా వారు కడప నుంచి మాచుపల్లె గ్రామం మీదుగా పచ్చని పంట పొలాలను చూసుకుంటూ సిద్దవటం చేరారు. సిద్దవటం నుంచి భాకరాపేట మీదుగా చెన్నైకి సైకిల్ యాత్ర చేపట్టారు. వారు మాట్లాడుతూ భారత దేశంలోని హైదరాబాద్, చెన్నై, నాగపట్నంతో పాటుగా శ్రీలంక పోర్టు, పుదుచ్చేరి ప్రాంతాలను సైకిల్ యాత్ర ద్వారా తిలకించనున్నట్లు తెలిపారు.

షార్ డిప్యూటీ డైరెక్టర్‌కు సన్మానం



షార్ డిప్యూటీ డైరెక్టర్ గోపీకృష్ణను సన్మానిస్తున్న గ్రామస్తులు

పెనగలూరు : శ్రీహరికోట అంతరిక్ష కేంద్రం (షార్) డిప్యూటీ డైరెక్టర్ గోపీకృష్ణకు సంక్రాంతి సందర్భంగా పెనగలూరులో ఘనంగా సన్మానం చేశారు. పెనగలూరు వాసి షార్ డిప్యూటీ డైరెక్టర్ కావడంపై అతని స్నేహితులు వేణుగోపాలస్వామి ఆలయ ప్రాంగణంలో ఈ కార్యక్రమం నిర్వహించారు. ధనయ్య తదితరులు మాట్లాడారు. ఈ కార్యక్రమంలో గోపీకృష్ణ తండ్రి పవిడికాల్వ చెంచు సుబ్బనరసయ్యతోపాటు కుటుంబ సభ్యులను కూడా సన్మానించారు.

ఆటో ఢీకొని వృద్ధుడి మృతి

మదనపల్లె : ఆటో ఢీకొని వృద్ధుడు మృతి చెందిన సంఘటన సోమవారం రాత్రి మదనపల్లెలో జరిగింది. అమ్మచెరువుమిట్టకు చెందిన వెంకటరమణ కుమారుడు రామస్వామి(64) పట్టణంలోకి సొంత పనులపై వచ్చాడు. తిరిగి ఇంటికి వెళ్లే క్రమంలో అమ్మచెరువుమిట్ట వద్ద రోడ్డు దాటుతుండగా, వేగంగా వచ్చిన ఆటో ఢీకొంది. ప్రమాదంలో రామస్వామి తీవ్రంగా గాయపడగా, గమనించిన స్థానికులు హుటాహుటిన ప్రభుత్వ జిల్లా ఆస్పత్రికి తరలించారు. అత్యవసర విభాగం వైద్యులు చికిత్స అందిస్తుండగా, పరిస్థితి విషమించి మృతి చెందాడు. భార్య లక్ష్మీదేవి ఫిర్యాదు మేరకు వన్‌టౌన్ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ ఎరీషావలి తెలిపారు.

పండగ సంబరం.. మధుర జ్ఞాపకం!

- పొలం గట్లలో సందడి చేసిన పట్టణ ప్రాంతాల యువత
- బరువెక్కిన హృదయాలతో పయనమవుతున్న బంధువులు

రాజంపేట టౌన్ : రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల్లో, రాష్ట్రం కాని రాష్ట్రాల్లో ఉండే ప్రజలు సంక్రాంతి కోసం వేయి కళ్లతో ఎదురుచూసి ఎంతో ఆనందంగా సొంతూళ్లకు వచ్చారు. ఆశించిన విధంగానే సంక్రాంతి అందరిలోను ఆనందభరితమైన స్మృతులను నింపింది. పేద, మధ్య తరగతి ప్రజలకు ఆర్థిక ఇబ్బందులు ఉన్నా ఉన్నంతలో పెద్ద పండుగను జరుపుకున్నారు. ఎక్కడెక్కడో స్థిరపడ్డ వారు సొంతూళ్లకు వచ్చిన సందర్భంగా తమ తల్లిదండ్రులతో, తోబుట్టువులతో, చిన్ననాటి స్నేహితులతో సంతోషంగా గడిపారు. పల్లెటూళ్లకు వచ్చిన యువతీ, యువకులు పొలంగట్లలో సందడి చేశారు. కాగా పండుగ మూడు రోజులు బంధువులు, మిత్రులు, ఆత్మీయులతో కలిసి, మెలసి సంతోషంగా జరుపుకున్న ప్రజలు కనుమ పండుగ రోజు సాయంత్రం నుంచే తాము నివసించే ప్రాంతాలకు ఒక్కొక్కరుగా బయలుదేరడం ప్రారంభించారు. బంధువులు, చిన్ననాటి స్నేహితులు, ఆత్మీయులతో ఆనందంగా గడిపిన వారు తిరుగు ప్రయాణంలో మాత్రం బరువెక్కిన హృదయాలతో పయనమవుతున్నారు.

తల్లడిల్లిన అవ్వా, తాతల మనసు

సంక్రాంతి సందర్భంగా అవ్వ, తాతల ఇంటికి వచ్చిన చిన్నారులు వచ్చీరాని మాటలతో మాట్లాడుతూ వారిని మూడు రోజుల పాటు ఆనందడోలికల్లో ముంచెత్తారు. వృద్ధులు తమ మనవళ్లు, మనవరాళ్లతోనే ఎక్కువ సమయం గడిపారు. చిన్న పిల్లలు కావడంతో అవ్వతాతలు వారిని ప్రేమతో చూసుకోవడంతో పాటు అల్లరి చేసినా భరించారు.



సంక్రాంతికి తీపి గుర్తుగా ఓ గ్రూప్ ఫొటో

అయితే మనవళ్లు, మనవరాళ్లు వెళ్లేటప్పుడు వృద్ధుల మనసులు తల్లడిల్లాయి. కొంతమంది అవ్వా, తాతలు కంటతడి పెట్టుకున్నారు. బరువెక్కిన హృదయాలతో తమ పిల్లలను అలాగే వారి పిల్లలను సాగనంపారు.

తీపిగురుతులన్నీ.. సెల్‌ఫోన్‌లలో బందీ

సంక్రాంతి సందర్భంగా జరిగిన అనేక వేడుకలను, ఆనందకరమైన సంఘటనలను ప్రజలు తమ సెల్‌ఫోన్‌లలో బంధించుకున్నారు. ముఖ్యంగా పల్లెసీమల్లోని అందాలను, చిన్ననాటి మిత్రులు, ఆత్మీయులతో ఫొటోలు దిగేందుకు ఆసక్తి చూపారు. పరమపదించిన వారి ఫొటోల వద్ద పెట్టిన దుస్తులు, చివరికి వారి సమాధులను సైతం ఫొటోలు తీసి తమ స్టేటస్‌లలో పెట్టుకున్నారు. తీపిగుర్తుగా గ్రూపు ఫొటోలు దిగారు. అమ్మా, నాన్న, అన్న, చెల్లి, అక్క, తమ్ముడు, బావ, బావమర్ది, మావయ్య, అత్తయ్య, అల్లుల్లు, మనవళ్లు, మనవరాళ్లు ఇలా అందరు ఒకేచోట కలిసిన ఆత్మీయబంధాలను ఫొటోలు, వీడియోల రూపంలో మరో ఏడాది పాటు దాచుకునేందుకు సెల్‌ఫోన్‌లు ఎంతగానో దోహదపడ్డాయి.



పల్లెసీమ పంటపొలాల్లో సందడి చేస్తున్న యువత

సంక్రాంతి ముందు చిన్నబోయిన ఆధునికత

సంక్రాంతి వేడుకల ముందు ఆధునికత చిన్నబోయింది. సంక్రాంతిని పురస్కరించుకొని పల్లెటూళ్లకు వచ్చిన పట్టణ వాసులు తమ ఆధునిక జీవనానికి భిన్నంగా సంస్కృతి, సంప్రదాయాలను పాటించారు. క్షణం సమయం దొరికినా సెల్‌ఫోన్‌తో గడిపే వారు సైతం తమ సెల్‌ఫోన్‌లకు విశ్రాంతినిచ్చి అమ్మా, నాన్నలతో, తోబుట్టువులతో, వచ్చిన బంధువులతో గడిపి చిన్ననాటి తియ్యటి జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు. జిల్లాలో అన్ని ప్రాంతాల్లోని ప్రజలు ఆధునికతకు భిన్నంగా సందడి చేశారు. దీంతో పల్లె, పట్టణం అన్న తేడా లేకుండా ఎక్కడ చూసినా సంక్రాంతి సందడి స్పష్టంగా కనిపించింది.

ఇంత హ్యాపీగా ఉంటుందనుకోలేదు



మేము చెన్నైలో ఉంటాము. సంక్రాంతికి రాజంపేటలో ఉండే మా పెద్దనాన్న వాళ్ల ఇంటికి వచ్చాము. నేను చిన్నప్పుడు ఒకసారి వచ్చాను. మళ్లీ ఇదేరావడం. ఈసారి మా బాబాయి, అత్తమ్మ వాళ్ల పిల్లలు అందరు వచ్చారు. పిల్లలమంతా బాగా ఆడుకొని ఎంజాయ్ చేశాము. చెన్నైలో ఇలా ఉండదు. సంక్రాంతికి ఇంత హ్యాపీగా ఉంటుందని అనుకోలేదు. ఎవెరి ఇయర్ కూడా సంక్రాంతికి రాజంపేటకు రావాలని ఉంది.

\- నిహీర, చెన్నై

ఆత్మీయతను పెంచుతుంది



నేను పలమనేరులో హెడ్‌మాస్టర్‌గా పనిచేస్తాను. ఈ ఏడాది సంక్రాంతికి రాజంపేటలో ఉండే మా అల్లుడి ఇంటికి వచ్చాము. బంధువులంతా కలిసి సరదాగా మాట్లాడుకోవడం, కలిసి భోంచేయడం బంధువులు, మిత్రుల మధ్య ఆత్మీయత మరింత బలపడుతుంది. మనుషులను దగ్గర చేసే పండుగ సంక్రాంతి. అందుకే అనాదిగా సంక్రాంతికి ఉన్న ప్రాధాన్యత ఏమాత్రం తగ్గడం లేదు.

\- రవీంద్ర, హెడ్‌మాస్టర్, పలమనేరు

కరెంట్ షాక్‌తో బాలుడికి తీవ్రగాయాలు

మదనపల్లె : గాలిపటాలు ఎగురవేస్తుండగా ప్రమాదవశాత్తు బాలుడు కరెంట్‌షాక్‌కు గురై తీవ్రంగా గాయపడిన సంఘటన మంగళవారం మదనపల్లెలో జరిగింది. పట్టణంలోని దిగువకురవంకకు చెందిన చెన్నకేశవ కుమారుడు చరణ్(13) స్థానికంగా ఏడో తరగతి చదువుతున్నాడు. సంక్రాంతి పండుగ సందర్భంగా మిద్దెపైకి వెళ్లి గాలిపటం ఎగురవేస్తూ వెనక్కు వచ్చి ప్రమాదవశాత్తు కరెంట్ తీగలకు తాకగా, షాక్‌కు గురయ్యాడు. ప్రమాదంలో తీవ్రంగా గాయపడగా కుటుంబ సభ్యులు హుటాహుటిన స్థానిక ప్రభుత్వ జిల్లా ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండటంతో మెరుగైన వైద్యం కోసం తిరుపతికి రెఫర్ చేశారు.

వ్యక్తిపై దాడి

మదనపల్లె : వాహనం బాడుగకు కావాలని డ్రైవర్‌ను పిలిపించి దాడిచేసిన ఘటన మంగళవారం రాత్రి మదనపల్లె మండలంలో జరిగింది. సీటీఎంకు చెందిన ఆంజనేయులు(45) టాటా ఏస్ వాహనం బాడుగకు నిర్వహిస్తూ జీవిస్తున్నాడు. ఈ క్రమంలో స్థానికుడైన సునీల్, బెంగళూరుకు బాడుగ ఉందని, సప్పలమ్మ గుడివద్దకు రావాలని ఆంజనేయులును కోరాడు. దీంతో ఆంజనేయులు సప్పలమ్మ గుడి వద్దకు చేరుకోగా, బెంగళూరుకు బాడుగ ఎంతని వారు అడగటం, రూ.10వేలు అవుతుందని ఆంజనేయులు చెప్పడంతో, రూ.7 వేలకు రావాల్సిందిగా సునీల్, మహేష్, నీల్, ఒత్తిడి చేశారు. దీంతో ఈ విషయమై వివాదం రేగగా, ఆంజనేయులుపై ముగ్గురూ కలిసి దాడిచేసి గాయపరిచారు. గమనించిన స్థానికులు బాధితుడిని మదనపల్లె ప్రభుత్వ జిల్లా ఆస్పత్రికి తరలించారు. తాలూకా పోలీసులు కేసు విచారణ చేస్తున్నారు.

పట్టుకున్నారు .. వదిలేశారు!

- రేషన్ బియ్యం లారీపై రోజంతా హైడ్రామా
- ఉదయం లేని రికార్డులు సాయంత్రానికి చేరుకున్న వైనం
- మరోసారి కంచికి చేరిన రేషన్ బియ్యం లారీ కథ



గుర్రంకొండలో ఉదయం పట్టుకొని సాయంత్రానికల్లా వదిలేసిన బియ్యం లారీ

గుర్రంకొండ : గుర్రంకొండలో పోలీసులు 25 టన్నులు గల రేషన్ బియ్యం లారీని ఉదయం పట్టుకొని సాయంత్రం వదిలేశారు. రేషన్ బియ్యం లారీ విషయమై పోలీస్ స్టేషన్ వద్ద రోజంతా హైడ్రామా నడిచింది. ఈ లారీకి సంబంధించి ఉదయం లేని రికార్డులు సాయంత్రానికల్లా పోలీస్ స్టేషన్‌కు చేరుకోవడంతో పోలీసులు హడావిడిగా బియ్యం లారీని వదిలేశారు. దీంతో వారం రోజుల్లో రెండవ సారి రేషన్ బియ్యం లారీ కథ కంచికి చేరడం గమనార్హం.

వివరాలు ఇలా ఉన్నాయి. మండల కేంద్రమైన గుర్రంకొండలో బుధవారం ఉదయం 4 గంటలకు స్థానిక పోలీసులు రేషన్ బియ్యం లారీని అదుపులోకి తీసుకొని స్టేషన్ వద్దకు తీసుకెళ్లారు. సదరు రేషన్ బియ్యం లారీ వెయ్యి 25 కేజీల బియ్యం బస్తాలతో రాయచోటి నుంచి కర్ణాటక రాష్ట్రం చింతామణికి వెళుతున్నట్లు సమాచారం. రేషన్ బియ్యం లారీని పోలీసులు అదుపులోకి తీసుకొన్న సమయం నుంచి హైడ్రామా మొదలైంది. పోలీసులు లారీని అదుపులోకి తీసుకొన్న సమయంలో రికార్డులు సరిగ్గా లేవని పేర్కొన్నారు. ఉదయం 8.30 గంటలకు వాల్మీకిపురం సివిల్ సప్లయ్స్ డీటీ ఫజులుల్లా పోలీస్ స్టేషన్ వద్దకు చేరుకున్నారు. ఆయన పోలీస్ స్టేషన్‌కు చేరుకొన్న కొద్దిసేపటికే వాల్మీకిపురం సీఐ ప్రసాద్ స్టేషన్ వద్దకు వచ్చారు. గంటల కొద్ది రెవెన్యూ, పోలీసు అధికారులు పోలీస్ స్టేషన్‌లో తర్జన భర్జన పడ్డారు. పోలీసులకు పట్టుబడిన రేషన్ బియ్యం లారీలో కొంత బియ్యాన్ని రేషన్ బియ్యం అవునా.. కాదా అని తేల్చడానికి రాయచోటికి పరీక్షకు పంపించామని అధికారులు మధ్యాహ్నం సమయంలో ప్రకటించారు. మరో సారి జిల్లా రెవెన్యూ అధికారులకు విషయం తెలియజేశామని లారీలో కొన్ని రికార్డులు అందుబాటులో ఉన్నాయని అవి సరైనవో కావో జిల్లా రెవెన్యూ అధికారులు చెప్పాల్సి ఉందంటూ డీటీ పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో జిల్లాకు చెందిన ఓ ఉన్నతశ్రేణి అధికార పార్టీ నాయకుడి నుంచి పెద్ద ఎత్తున సిఫార్సులు అధికారులకు వెళ్లినట్లు సమాచారం. మరోవైపు స్థానిక అధికార పార్టీ నాయకులు రోజు రేషన్ బియ్యం లారీలు గుర్రంకొండ నుంచి వెళుతున్నాయని, ఎట్టిపరిస్థితుల్లోనూ లారీపై కేసు నమోదు చేయాలని పట్టుబట్టారు. అయితే ఏం జరిగిందో తెలియదు కానీ సాయంత్రానికల్లా పోలీస్ స్టేషన్ వద్ద ఉన్న రేషన్ బియ్యం లారీని పోలీసులు వదిలేశారు. ఈ విషయమై వాల్మీకిపురం సీఐ ప్రసాద్, గుర్రంకొండ ఎస్ఐ మధురామచంద్రుడులను వివరణ కోరగా సివిల్ సప్లయ్స్ డీటీ రేషన్ బియ్యం లారీకి సంబంధించిన రికార్డులు సక్రమంగా ఉన్నాయని చెప్పడంతో వదిలేశామన్నారు. వారం రోజుల క్రితం ఇదే విధంగా 30 టన్నుల రేషన్ బియ్యం లారీని రికార్డులు సరిగ్గా లేవని పేర్కొంటూ పోలీసులు పట్టుకొని ఐదు రోజుల తరువాత బిల్లు లు, రికార్డులు సరిగ్గా ఉన్నాయని పేర్కొంటూ విడిచి పెట్టారు. బుధవారం మరోసారి రేషన్ బియ్యం లారీని ఉదయం పట్టుకొని సాయకాలం వదిలి పెట్టడంతో రెండవ సారి బియ్యం లారీ కథ కంచికి చేరిందని జనం చర్చించుకోవడం గమనార్హం.

పోలీసులకు భయపడి.. వ్యక్తి ఆత్మహత్య

పెద్దతిప్పసముద్రం : మండలంలోని టి.సదుంకు చెందిన కుల్లోళ్ల వెంకట్రమణ (46) మంగళవారం వేకువ జామున జెడ్పీ హైస్కూల్ పక్కన ఉన్న డంపింగ్ యార్డులో ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. కర్ణాటక పోలీసులకు భయపడి ప్రాణ భయంతోనే తన తండ్రి ఆత్మహత్య చేసుకున్నాడని మృతుడి కుమారుడు మణికంఠ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కాగా మృతుడి భార్య కూడా తన భర్త వివాహేతర సంబంధం కారణంగా ఆరు నెలల క్రితం ఉరేసుకుని మృతి చెందింది. మృతుడి కుమారుడు పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదు మేరకు వివరాలిలా ఉన్నాయి. వెంకట్రమణ పల్లెల్లో తిరుగుతూ ఐస్‌క్రీం వ్యాపారం చేసేవాడు. ఈ నేపథ్యంలో కర్ణాటక రాష్ట్రం బట్లపల్లి సమీపంలోని దేవప్పల్లికి చెందిన ఓ వివాహితతో వివాహేతర సంబంధం ఏర్పరచుకున్నాడు. విషయం తెలుసుకున్న భార్య ప్రమీల భర్తను నిలదీసినా ప్రయోజనం లేకపోవడంతో ఆమె జీవితంపై విరక్తి పెంచుకుని గత ఏడాది జూన్ 9న వారి పొలం వద్దే ఉరేసుకుని ఆత్మహత్య చేసుకుంది. ఇదిలా ఉండగా తన భార్య అదృశ్యంపై తమకు వెంకట్రమణ అనే వ్యక్తిపై అనుమానం ఉందని గత ఏడాది డిసెంబర్ 2న దేవప్పల్లికి చెందిన మహిళ భర్త బట్లపల్లి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. దీంతో కేసు నమోదు చేసిన కర్ణాటక పోలీసులు మిస్సింగ్ కేసును ఛేదించేందుకు రంగంలోకి దిగి అనుమానితుడి కుటుంబ సభ్యులను అదుపులోకి తీసుకున్నారు. విషయం తెలుసుకున్న వెంకట్రమణ కర్ణాటక పోలీసులు చంపేస్తారేమోనని ప్రాణ భయంతో ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు.



ఉరేసుకున్న వెంకట్రమణ

కర్ణాటక పోలీసులపై మండిపడిన పీటీఎం ఎస్ఐ

కుటుంబీకుల సమక్షంలో శవాన్ని కిందకు దించి కేసు నమోదు చేయాలని మీ అదుపులో ఉన్న మృతుడు వెంకట్రమణ కుటుంబ సభ్యులను ఇక్కడకు పంపాలని ఎస్ఐ రవికుమార్ కర్ణాటక పోలీసులకు ఫోన్ ద్వారా సూచించారు. వారు ససేమిరా అనడంతో ఎస్ఐ సిబ్బందితో కలసి కర్ణాటక రాష్ట్రం బట్లపల్లి పోలీసు స్టేషన్‌కే స్వయంగా వెళ్లి అక్కడి పోలీసులను మందలించారు. మీకు కొంచెం కూడా మానవత్వం లేదా అక్కడ శవం కుళ్లిపోతున్నా పట్టించుకోరా, తప్పు చేసినోడు చచ్చి శవమయ్యాడు, మేము ఎవరి ఫిర్యాదు తీసుకుని కేసు కట్టాలంటూ మండిపడ్డారు. ఎట్టకేలకు కర్ణాటక పోలీసులు అదుపులో ఉన్న వారిని తిరిగి పంపడంతో ఎస్ఐ రవికుమార్ కేసు నమోదు చేసి శవాన్ని పోస్టుమార్టం నిమిత్తం మదనపల్లి జిల్లా ఆసుపత్రికి తరలించారు.

ఆర్టీసీ బస్సు ఢీకొని యువకుడికి తీవ్ర గాయాలు

మదనపల్లె : ఆర్టీసీ బస్సు ఢీకొని యువకుడు తీవ్రంగా గాయపడిన సంఘటన మంగళవారం రాత్రి కురబలకోట మండలంలో జరిగింది.

బి.కొత్తకోట మండలం బడికాయలపల్లెకు చెందిన చిన్నప్ప(24) కుటుంబ పోషణ నిమిత్తం ఊరూరా తిరిగి తినుబండారాల వ్యాపారం చేస్తుంటాడు. ఈ క్రమంలో మంగళవారం వ్యాపారం ముగించుకుని ద్విచక్రవాహనంలో తిరిగి వెళుతుండగా, తెట్టు పంచాయతీ దొమ్మన్నబావి వద్ద ఆర్టీసీ బస్సు ఢీకొనడంతో తీవ్రంగా గాయపడ్డాడు. గమనించిన స్థానికులు 108 వాహనంలో మదనపల్లె ప్రభుత్వ జిల్లా ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండటంతో మెరుగైన వైద్యం కోసం తిరుపతికి రెఫర్ చేశారు.

అనుమానాస్పద స్థితిలో వ్యక్తి మృతి



రామ్మోహన్(ఫైల్)



రామ్మోహన్ మృతదేహం

కలకడ : అనుమానాస్పద స్థితిలో ఓ వ్యక్తి మృతి చెందిన సంఘటన బుధవారం కలకడ–గుర్రంకొండ మార్గంలోని కె.దొడ్డిపల్లె పంచాయతీ బుడ్డకాలువ వంక సమీపంలో జరిగింది. స్థానికుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. కలకడ మండలం, రాతిగుంటపల్లె మాజీ సర్పంచ్ మద్దిశెట్టి రమాదేవి భర్త రామ్మోహన్ (52) తన ద్విచక్రవాహనంలో కలకడలో తన వ్యక్తి గత పని ముగించుకుని తిరుగు ప్రయాణమయ్యాడు. స్వగ్రామం చేరుకుంటున్న సమయంలో మార్గమధ్యంలో ద్విచక్రవాహనం అదుపుతప్పి కిందపడ్డాడు. ప్రమాదం జరిగిన స్థలంలోనే దుర్మరణం చెందాడు. ద్విచక్రవాహనం దెబ్బతినకపోవడంతో మృతిపై స్థానికుల్లో అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. మృతుడికి భార్య రమాదేవి, ముగ్గురు కుమార్తెలు, ఒక కుమారుడు ఉన్నారు. కలకడ పోలీసులు కేసు నమోదు చేశారు.

దాడిలో యువకుడికి గాయాలు

రాయచోటి : రాయచోటి పట్టణంలో రౌడీమూకలు రెచ్చిపోయారు. బుధవారం రాత్రి పీకలదాకా మద్యం తాగిన ఇమ్రాన్, ఇస్రాన్ రియాన్, జాహిద్ అతని అనుచరులు అఫ్గాన్ (20) అనే యువకుడిపై దాడి చేశారు. ఒక్కసారిగా 20 మంది రాడ్లు, కర్రలు, బండలతో దాడి చేయడంతో తీవ్రంగా గాయపడ్డాడు. ఇమ్రాన్, ఇస్రాన్‌పై ఇప్పటికే పలు కేసులు ఉన్నాయి. ఈ సంఘటనపై రాయచోటి పోలీసులు కేసు నమోదు చేసి విచారణ చేస్తున్నట్లు తెలిపారు.

వివాహిత ఆత్మహత్యాయత్నం

మదనపల్లె : భర్తపై సోషల్‌మీడియాలో అసత్య ప్రచారం చేయడమే కాకుండా, ఇంటికి వచ్చి అసభ్యంగా మాట్లాడటంతో మనస్తాపం చెంది ఓ వివాహిత ఆత్మహత్యకు యత్నించిన ఘటన మంగళవారం మదనపల్లెలో జరిగింది. పట్టణంలోని దేవళంవీధికి చెందిన హేమంత్‌పై గరుడ పార్కింగ్‌లో పనిచేస్తున్న నరేష్ సోషల్‌మీడియాలో తప్పుడు ప్రచారం చేశాడు. అంతేకాకుండా, ఇంటివద్దకు వెళ్లి హేమంత్ భార్య జ్యోతి(22)ని అసభ్య పదజాలంతో దూషించాడు. దీంతో మనస్తాపం చెందిన ఆమె ఇంటి వద్ద పురుగుమందు తాగి ఆత్మహత్యకు యత్నించింది. గమనించిన స్థానికులు బాధితురాలిని మదనపల్లె ప్రభుత్వ జిల్లా ఆస్పత్రికి తరలించారు. ఐసీయూ విభాగంలో చికిత్స పొందుతోంది. వన్‌టౌన్ పోలీసులు కేసు విచారణ చేస్తున్నారు.

జోరుగా కోడి పందేలు

సాక్షి టాస్క్‌ఫోర్స్: రైల్వేకోడూరు నియోజకవర్గంలో సంక్రాంతి పండుగ మూడు రోజులపాటు గ్రామాలలో కోడిపందేలను నిర్వహించారు. కూటమికి చెందిన నాయకుల అండదండలతో రైల్వేకోడూరు, ఓబులవారిపల్లి, పుల్లంపేట మండలాల్లో కోడిపందేలను పెద్దఎత్తున నిర్వహించారు. కొన్నిచోట్ల కోడిపందేలతోపాటు బుడుగాట, చెక్కాబొమ్మ జూదం ఏర్పాటు చేశారు. కోడిపందేలు, జూదం నిర్వహిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించిన పోలీసులు మూడు రోజులపాటు జోరుగా కోడిపందేలు జరుగుతున్నా పట్టించుకోలేదు. కొన్నిచోట్ల అనుమతులు తీసుకున్నామని నిర్వాహకులు బహిరంగంగా నిర్వహించారు. పోలీసులు మామూళ్ల మత్తులో కోడిపందేల స్థావరాలపై దాడులు చేయలేదని గ్రామీణ ప్రాంత ప్రజలు విమర్శిస్తున్నారు.

పార్వతీపురంలో చోరీ

సిద్దవటం : పార్వతీపురం రోడ్డు నంబర్ 4లో ప్రభుత్వ బీసీ బాలుర వసతి గృహంలో వంట మనిషిగా పనిచేస్తున్న పెంచలమ్మ ఇంటిలో గుర్తు తెలియని వ్యక్తులు 10 తులాల బంగారు, రూ. 36వేల నగదు చోరీ చేశారు. బాధితురాలి కథనం మేరకు..శనివారం రాత్రి తమ అత్త నరసమ్మ అనారోగ్యం ఆసుపత్రిలో ఉండటంతో కడపకు వెళ్లారు. తమ ఇంటి ఎదురుగా నివాసం ఉంటున్న వారు సోమవారం ఉదయం ఫోన్ చేసి మీ ఇంటి తాళాలు తీసి ఉన్నాయని సమాచారం ఇచ్చారు. దీంతో 100 నంబర్‌కు ఫోన్ చేసి పోలీసులకు తెలియజేశారు. అనంతరం ఆమె మంగళవారం స్థానిక పోలీసులను కలసి ఫిర్యాదు చేశారు. ఏఎస్ఐ సుబ్బరామచంద్రుడును వివరణ కోరగా బాధితురాలి ఫిర్యాదు మేరకు సిద్దవటం ఇన్‌చార్జి ఎస్ఐ శివప్రసాద్ ఆధ్వర్యంలో దర్యాప్తు చేస్తున్నారని తెలిపారు.

పండగ పూట విషాదం

- క్వారీ గుంతల్లో ఈతకు వెళ్లి యువ ఇంజినీర్ మృత్యువాత
- 15 రోజుల్లో ఇంగ్లాండ్‌కు వెళ్లాల్సి ఉండగా దుర్ఘటన



వెంకటరత్నం (ఫైల్)

గుర్రంకొండ : అతనో యువ ఇంజినీర్. 15 రోజుల్లో ఇంగ్లాండ్‌లో సాఫ్ట్‌వేర్ ఇంజినీర్ ఉద్యోగానికి వెళ్లేందుకు అన్ని ఏర్పాట్లు చేసుకున్నాడు. ఇంతలోనే సంక్రాంతి పండుగ వచ్చింది. స్నేహితులంతా సరదాగా క్రికెట్ ఆడుకొన్నారు. అందరూ కలసి ఈత కొడదామని క్వారీ గుంతల్లో ఉన్న నీటి చలమల్లో దిగారు. ఆ నీటి గుంత యువ ఇంజినీర్‌ను బలితీసుకుంది. ఈ విషాద సంఘటన మండలంలో చెర్లోపల్లె పంచాయతీ దద్దాలవారిపల్లెలో జరిగింది. వివరాలు ఇలా ఉన్నాయి. కలకడ మండలం గుడిబండ పంచాయతీ చొక్కనవారిపల్లెకు చెందిన బి.సూరి కుమారుడు బి. వెంకటరత్నం (24) ఇంజినీరింగ్ పూర్తి చేశాడు. ఇటీవల ఇంగ్లాండ్‌కు వెళ్లి ఎంఎస్ పూర్తి చేసుకొని ఆరునెలల క్రితం స్వగ్రామానికి వచ్చాడు. ఆరు నెలలుగా ఇంగ్లాండ్‌లో సాఫ్ట్‌వేర్ ఉద్యోగం కోసం ప్రయత్నించి ఇటీవల ఉద్యోగానికి ఎంపికయ్యాడు. 15 రోజుల్లో ఇంగ్లాండ్‌కు వెళ్లి ఉద్యోగంలో చేరాల్సి ఉంది. ఈ నేపథ్యంలో మంగళవారం సంక్రాంతి పండుగ కావడంతో గ్రామంలోని స్నేహితులంతా కలిసి క్రికెట్ ఆడారు. మధ్యాహ్నం సరదాగా ఈత కొట్టాలని గుర్రంకొండ మండలం చెర్లోపల్లె పంచాయతీ దద్దాలవారిపల్లెకు సమీపంలో క్వారీ గుంతల వద్దకు చేరుకున్నారు. స్నేహితులంతా క్వారీ గుంతల్లో దిగి ఈత కొట్టారు. ఏం జరిగిందో తెలియదు కానీ వెంకటరత్నం మాత్రం క్వారీ గుంతల్లో మునిగిపోయాడు. జరిగిన సంఘటనపై స్నేహితులు మృతుడి కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. కుటుంబ సభ్యులతో పాటు రెస్క్యూ టీం సభ్యులు దద్దాలవారిపల్లెలోని క్వారీ గుంతల వద్దకు చేరుకొని గాలించారు. చాలా సేపటి తరువాత మృతదేహాన్ని బయటకు తీశారు. జరిగిన సంఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ మధురామచంద్రుడు తెలిపారు. యువ ఇంజినీర్ మృతితో గ్రామంలో విషాద ఛాయలు అలుముకున్నాయి.



వెంకటరత్నం మృతదేహం కోసం గాలిస్తున్న రెస్క్యూ టీమ్ సభ్యులు

మహిళ గొలుసు చోరీకి యత్నం



బాధితురాలు కొలవల వెంకటసుబ్బమ్మ

ఓబులవారిపల్లె : ముక్కావారిపల్లి–ఓబులవారిపల్లి మధ్య జాతీయ రహదారిపై మహిళ మెడలో గొలుసు చోరీకి గుర్తు తెలియని వ్యక్తులు విఫల యత్నం చేశారు. బాధితురాలు మంగంపేట కాపుపల్లి గ్రామానికి చెందిన కొలవల వెంకటసుబ్బమ్మ కథనం మేరకు.. తన భర్త కొలవల శ్రీనివాసులురెడ్డితో కలిసి పుల్లంపేట మండలం, మల్లెంవారిపల్లి నుంచి మంగంపేట కాపుపల్లికి బైక్‌పై వస్తుండగా ముక్కావారిపల్లి సమీపానికి రాగానే బైకుపై వేగంగా వచ్చిన ఇద్దరు వ్యక్తులు ఆమె మెడలోని గొలుసును లాగారు. గొలుసు రాకపోవడంతో ఆమెను తోసేసి వెళ్లిపోయారు. బైక్‌పై నుంచి కిందపడటంతో కాళ్లు, చేతులకు గాయాలయ్యాయి. దొంగలను గుర్తించేందుకు సీసీ కెమెరాలను పరిశీలిస్తున్నట్లు ఎస్ఐ పి.మహేష్ తెలిపారు.

టపాసుల దుకాణంలో అగ్నిప్రమాదం

మదనపల్లె : టపాసుల దుకాణంలో అగ్నిప్రమాదం సంభవించిన ఘటన బుధవారం జరిగింది. ఫైర్ ఇన్స్‌పెక్టర్ శివప్ప కథనం మేరకు.. మండలంలోని వేంపల్లె మా క్రాకర్స్ దుకాణంలో అగ్నిప్రమాదం జరిగినట్లు మధ్యాహ్నం ఫైర్ స్టేషన్‌కు సమాచారం అందడంతో ప్రమాద స్థలానికి చేరుకున్నామన్నారు. అయితే అప్పటికే టపాసుల దుకాణం సిబ్బంది అందుబాటులో ఉన్న అగ్నినిరోధక పరికరాలను ఉపయోగించి మంటలను ఆర్పివేశారన్నారు. ఓ వినియోగదారుడు అవగాహన లేకుండా టపాసులను పేల్చడంతో ప్రమాదం సంభవించిందన్నారు. ఘటనలో సుమారు రూ.20వేల ఆస్తినష్టం ఉండవచ్చని యజమాని చెప్పారన్నారు.



టపాసుల దుకాణంలో మంటలు ఆర్పుతున్న ఫైర్ సిబ్బంది